క్లుప్తంగా

మిషన్ ఇంద్రధనస్సు పరిశీలన

యాదమరి: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ పరిశీలించారు. మండలంలోని ఆరిమాకుల పల్లెలో సోమవారం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మాతాశిశు మరణాలు పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 31 మంది ఎంపిక



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 31 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 55 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 31 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు మోర్ధానపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్

యాదమరి: మండలంలోని మోర్ధానపల్లె సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ హాజరు కానున్నట్లు తెలిపారు.

బాలికల కళాశాల తనిఖీ



కళాశాలను తనిఖీ చేస్తున్న ప్రభాకర్ రెడ్డి

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల గ్రామంలో ఉన్న బాలికల కళాశాలను ఇంటర్ మీడియట్ రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఉదయం ఆయన కళాశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మార్చిలో నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పరీక్ష కేంద్రానికి కావలసిన మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లలిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సమ్మె నోటీసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారించాలని సమ్మెకు పూనుకున్నట్లు సీఐటీయూ నాయకులు నాగరాజు, గోపినాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ అధికారులను కలిసి సమ్మె నోటీసును అందించారు. కార్యక్రమంలో నాయకులు మణి, గోపినాథ్, దాసరి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యం భారతి జయంతి వేడుకలు



మాట్లాడుతున్న పాఠశాల హెచ్‌ఎం లలిత

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి రచయిత సాహిత్య వేత్త సుబ్రమణ భారతి జయంతిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం పాఠశాల ఆవరణంలో కవి సుబ్రమణ్యం భారతి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె ప్రతిభను పాఠశాల హెచ్‌ఎం లలిత విపులంగా విద్యార్థులకు వివరించారు.

స్పందన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యం

చిత్తూరు అర్బన్: స్పందన ద్వారా వచ్చే అర్జీలను అత్యధిక ప్రాధాన్యమివ్వాలని నగర కమిషనర్ అరుణ అన్నారు. చిత్తూరు నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌ఓ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం: మణికంఠేశ్వర స్వామి ఆలయంలో పిండిదీపాలు వెలిగిస్తున్న మహిళలు, బంగారుపాళెం: మొగిలి శివాలయం ఎదుట కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చిత్తూరు: మహిళా ఉద్యోగులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జిలు







శివాలయాల్లో కార్తీక జ్యోతులు

- చివరి సోమవారం కిక్కిరిసిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- బిల్వచెట్టుకు పూజలు, వనభోజనాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు చేశారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మొగిలి శివాలయానికి తరలివచ్చారు. ఆలయం ముందు మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం ఆవరణలోని బిల్వచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి ప్రదక్షిణలు చేపట్టారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుకేతు పూజలు

మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజ కార్యక్రమాలను చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ పూజల్లో పాల్గొన్నారు.

మణికంఠేశ్వర ఆలయంలో..

ఐరాల: మండలంలోని మతంపల్లె మణికంఠేశ్వర ఆలయంలో చివరి కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు వేదాంత్ ఆధ్వర్యంలో శివుడికి తైలాభిషేకాం, పంచామృతాభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేసి, కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. అనంతరం ఉసిరి చెట్టు కింద నేతి దీపాలు వెలిగించారు. భక్తులకు అర్చకుడు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఐరాల: విశేష పూజలు అందుకుంటున్న శివయ్య

కాణిపాకంలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామి అనుబంధ ఆలయం అయిన శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తిక నెల సోమవారం పూజలను మహిళలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చక వేదపండితులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఉసిరిచెట్టు వద్ద పిండిదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శివోహం

చిత్తూరు రూరల్: కార్తీక సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని, దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేకాభిషేకాలు చేశారు. పూజలు, దీపారాధనలు నిర్వహించారు. మరో వైపు భక్తుల ఓం శివోహం, హర హర మహాదేవ నినాదాలతో శివనామస్మరణ మార్మోగింది.

కాలభైరవేశ్వర ఆలయంలో..

తవణంపల్లె: మండల కేంద్రంలోని కాలభైరవేశ్వర ఆలయంలో కార్తీక మాసం సోమవారం భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయంలో కాలభైరవేశ్వరునికి, శివలింగానికి, నందీశ్వరునికి అభిషేకం చేయించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కార్తీక సోమవారం కావడంతో భక్తులు నెల్లిచెట్టుకు పూజలు చేసి దీపారాధన చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అరగొండ-గాజులపల్లె రోడ్డులో అరగొండ మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నెల్లిచెట్టుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పలువురికి వనభోజనాలు పెట్టారు.

భీమేశ్వరాలయంలో..

పూతలపట్టు: కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా మండలంలోని స్థానిక భీమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలకరించారు.

నగరవనంలో కార్తీక దీపోత్సవం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పెనుమూరు క్రాస్ వద్ద గల అటవీశాఖ నగరవనంలో కార్తీక సోమవారం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళ ఉద్యోగులకు ముగ్గులు పోటీలు పెట్టారు. ఉద్యోగులకు అపోలో ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. నగరవనం ప్రాంగణంలో మొక్కలు నాటి దీపాలు వెలిగించారు. అందరు కలిసి వనభోజనాలు చేశారు. ముగ్గులపోటీల్లో విజేతలకు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి దంపతులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, డీఆర్వో స్వప్నకుమారి, ఎఫ్‌బీఓ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు: దీపాలు వెలిగిస్తున్న డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి దంపతులు



తవణంపల్లె: ఉసిరి చెట్టుకు పూజ చేస్తున్న భక్తులు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎఫ్‌ఓ

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడా సామగ్రిని పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ గౌరి అన్నారు. ఈ క్రీడా పోటీల్లో భాగంగా గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు 15 ఏళ్లకు పైగా వయసు ఉండాలని సూచించారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 వరకు, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకు, నియోజకవర్గ స్థాయిలో 5 నుంచి 10, జిల్లా స్థాయిలో 11 నుంచి 21 వరకు, రాష్ట్ర స్థాయిలో 22 నుంచి 25 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో హుండీ ఆదాయం రూ.11.16 లక్షలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామికి హుండీ కానుకల ద్వారా రూ.11.16 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో సోమవారం ఆలయ సిబ్బంది హుండీ కానుకలు ఎండోమెంట్ అధికారి చలపతి ఆధ్వర్యంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 98 రోజులకు సంబంధించి ఆలయంలోని అన్ని హుండీల్లోని కానుకలు లెక్కించగా రూ.11,16,583 నగదు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అరగొండ ఎస్‌జీబీ మేనేజర్ శివానందరెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు పార్థసారథి రెడ్డి, సందీప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స.హ. చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమాచార హక్కు చట్టం కమిషనర్ చెన్నారెడ్డిని కలిసిన అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని సమాచారహక్కు ఏ సొసైటీ (నేషనల్) అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ సోమవారం తమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ మహబూబ్ బాషా, కమిషనర్ చెన్నారెడ్డిని కలిశామన్నారు. సమాచార హక్కు చట్టం అమలు విధానంపై వారితో చర్చించినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని 2005 నుంచి పటిష్టంగా అమలు చేస్తున్నారన్నారు. గతంతో పోల్చితే ప్రస్తుతం సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో చైతన్యం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ సభ్యులు వినోద్‌కుమార్, మోహన్‌కుమార్, రాంప్రకాష్, జ్యోతిప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నష్టం అంచనా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తుపాను ప్రభావంతో జరిగిన పంటనష్టం అంచనాలను పకడ్బందీగా చేపట్టినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వివేదీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న 125 గ్రామాల్లో పంటనష్టం జరిగిందన్నారు. ఇందులో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 619 హెక్టార్లల్లో పంట నష్టపోయినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో 215 హెక్టార్లల్లో నష్టపోయినట్లు చెప్పారు. ఈ పంటలకు ప్రత్యామ్నాయంగా పంటలు వేసుకునేందుకు 80 శాతం సబ్సిడీ ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఉద్యానవన పంటలు 32 హెక్టార్లల్లో నష్టం జరిగిందని వెల్లడించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్

చిత్తూరు కలెక్టరేట్ : హక్కులపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణాకర్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో మానవహక్కుల ఫౌండేషన్, వైఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షురాలు భారతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఆర్టికల్ 21, మానవహక్కుల ఆవిర్భావం, చట్టాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. టీచర్లు విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచాలని సూచించారు. డీవైఈఓ చంద్రశేఖర్, సభ్యులు ధనరాజ్, మునస్వామి పాల్గొన్నారు.

రామాపురంలో వికసిత్ భారత్

గుడిపాల: మండలంలోని 197 రామాపురంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శాఖ అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో దుర్గా రామకృష్ణ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్‌ఐ భారతి తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా గంగనపల్లెకు చెందిన గిరిధర్ (25)ను అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతని వద్ద ఉన్న సంచిని పరిశీలిస్తే 56 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నిందితుడ్ని అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించండి



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ స్పందనలో నమోదయ్యే అర్జీలను ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు స్పందనలో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 383 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ తక్షణమే క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఆయా శాఖలకు స్పందన కార్యక్రమం ద్వారా అందే అర్జీలను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో శివయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు ప్రాధాన్యం

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ సమస్యలపై ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తికి సైతం వినతులు అందచేయగా.. వాటిని విచారించి న్యాయం చేస్తామన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

బంగారుపాళెం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ అమరావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పాలేరు గ్రామ సచివాలయంలో సోమవారం సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు బుక్‌లెట్లను పంపిణీ చేసి ప్రభుత్వం ద్వారా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారు మాట్లాడుతూ, ఎన్నికల్లోని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ అవినీతికి తావు లేకుండా పథకాలను అమలు చేశామన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా నేరుగా ఇంటికే పింఛన్, సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు, కుల మతాలకు అతీలంగా ప్రజా సంక్షేమాన్ని కోరే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బంగారుపాళెం : వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి

ఐరాల: అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లె, మొరంపల్లె, ఇరువారంపల్లె సచివాలయాల పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా, అన్ని వర్గాల అభ్యున్నతికి జగనన్న కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో పేదలకు, అర్హులకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే వచ్చి పథకాలు, ప్రభుత్వ సేవలు అందజేస్తున్నామన్నారు. జగనన్న ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు ఇప్పటికే అమలు చేసిందన్నారు. అనంతరం సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ హారూన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు చలపతి రెడ్డి, పూజారి మోహన్‌రెడ్డి, ధనచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, దేవేంద్ర, రత్నం, లోకనాథ్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేయనపల్లిలో..

గుడిపాల: మండలంలోని పేయనపల్లి గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ప్రజలకు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో కూడా జగనన్ననే గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమ్య, ఏసయ్య, గణపతి, దేవ ప్రసాద్, సింసోన్, ఎంపీటీసీ యోవాన్ పాల్గొన్నారు.







బంగారుపాళెం: పాలేరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు, ఐరాల: బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, గుడిపాల: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

ప్రజారోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్ భరోసా



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: పేద ప్రజల ఆరోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం భరోసా కల్పిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకల రెడ్డివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వర్షాలు కారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీరు గోరు వెచ్చగా ఉంచుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.